ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.03.04.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. లోక్ సభలో నిన్న ఆమోదం పొందిన 2025 వక్ఫ్ సవరణ బిల్లు మరి కొద్ది సేపట్లో రాజ్యసభలో చర్చకు రానుంది.
2. రంగారెడ్డి జిల్లాలోని వివాదాస్పద 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.
3. వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించిందని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి తెలిపారు.
4. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

----------------------------

**RS - WAQF**

2025 వక్ఫ్ సవరణ బిల్లు – పరిశీలన, ఆమోదం కోసం రాజ్యసభ ఈ మధ్యాహ్నం చర్చను చేపడుతుంది. ఈ ఉదయం సభ సమావేశమైనప్పుడు ఈ బిల్లుపై మధ్యాహ్నం చర్చను చేపడుతున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రకటించారు. దాదాపు 12 గంటల చర్చ అనంతరం నిన్న రాత్రి లోక్‌సభ బిల్లును

ఆమోదించింది.  వక్ఫ్ సవరణ బిల్లు, 2025 వారసత్వ ప్రదేశాలను రక్షించడానికి సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి నిబంధనలతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఆస్తి నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, వక్ఫ్ బోర్డులు స్థానిక అధికారుల మధ్య సమన్వయాన్ని క్రమబద్ధీకరించడం భాగస్వాముల హక్కులను పరిరక్షించడం ద్వారా పాలనను మెరుగుపరచడం కూడా ఈ చట్టం  ముఖ్య ఉద్దేశం.

**NSD**

--------------------------------

**SC - KANCHA LANDS**

రంగారెడ్డి జిల్లాలోని వివాదస్పద 400 ఏకరాల భూములపై సుప్రీంకోర్టులో ఈ రోజు విచారణ జరిగింది. ప్రభుత్వం విక్రయించాలనుకున్న భూములను సందర్శించి ఈ మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల వరకు  నివేదిక అందించాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ను కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా హైకోర్టులో విచారణపై తాము ఎలాంటి స్టే ఇవ్వడం లేదని పేర్కొంది.  గత 30 సంవత్సరాలుగా ఈ భూమి వివాదంలో ఉందని, అటవీ భూమి అని ఆధారాలు లేవని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.  తదుపరి ఆదేశాలు  ఇచ్చే వరకు చెట్లను తొలగించరాదని ప్రభుత్వ ప్రధాన కార్యద్శిని సుప్రీం కోర్టు ఆదేశించింది. కంచి గచ్చిబౌలి భూముల పరిరక్షణ కోసం హైదరాబాద్ లో విద్యార్థుల ఆందోళన ఈ రోజు కూడా కొనసాగుతోంది. సచివాలయం ముట్టడికి ప్రయత్నించిన ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**(SHANKAR)**

-------------------

**THUMMALA N RAO**

రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సేవలు అందిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈరోజు ఖమ్మంలో ఏర్పాటు చేసిన రైతు బజారును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో మూసివేయబడిన రైతు బజార్ ను తిరిగి 50 లక్షల రూపాయల వ్యయంతో తీర్చిదిద్ది అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతు బజార్లో మొత్తం 76 స్టాల్స్ నిర్మించి, 250 మంది రైతులు కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునే విధంగా ఏర్పాటు చేశారు.

**( PTC)**

-------------------

**PONNAM PRABHAKAR**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ నిన్న జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించిన బీసీ సంఘాల నేతలు ఈ రోజు ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీని పార్లమెంటు హాల్ లో కలిశారు. కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన వారిలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విప్ ఆది శ్రీనివాస్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు, బీసీ సంఘాల నేతలు ఉన్నారు.

రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రిజర్వేషన్ల అమలుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు.

**----------- బైట్ – పొన్నం ప్రభాకర్ ---------------**

**(SHANKAR)**

---------------------

**KTR PC**

కంచ గచ్చిబౌలి భూములను ఎవరూ కొనొద్దని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి రామారావు విజ్ఞప్తి చేశారు. ఒక వేళ ఎవరైన కొన్నా తమ పార్టీ అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుంటామని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఆయన ఈ రోజు హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే కంచ గచ్చిబౌలి భూములను ఎకో పార్క్ గా తీర్చి దిద్ది హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి బహుమతిగా ఇస్తామన్నారు. ఈ భూముల వ్యవహారంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే పోరాటం చేస్తామని అన్నారు. అంతకు ముందు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కే.టీ. రామారావు నివాళులు అర్పించారు. కొమరయ్య ఆశయాలను సాధించే దిశగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు.

**(SHANKAR)**

------------------------

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

-----------------------------

**DODDI KOMARAIAH**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చిత్ర పటానికి పలువురు ప్రముఖులు, ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. సంగారెడ్డిలో మంత్రి దామోదర రజనరసింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి, సిరిసిల్లాలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అసిఫాబాద్ లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తదితరులు దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నారు.

**(PTC,S)**

----------------------

**మహేశ్ కుమార్ గౌడ్...**

రాష్ట్ర మంత్రి వర్గంలో మైనార్టీలకు అవకాశం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి వర్గ విస్తరణ అంశం ఏఐసీసీ పరిధిలోనిదని అన్నారు. కంచగచ్చిబౌలి భూములు పూర్తిగా ప్రభుత్వానివేనని మరో సారి స్పష్టం చేశారు. ఈ భూములపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ముస్లీం రిజర్వేషన్ల విషయంలో  తమిళనాడు తరహాలోనే తెలంగాణకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

**(SHANKAR)**

------------------------

**CHAPATA CHILLI**

వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ నుంచి ధ్రువీకరణ పత్రం అందిందని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి  దండా రాజిరెడ్డి తెలిపారు. భౌగోళిక గుర్తింపు లభించడం ద్వారా వరంగల్ చపాటా మిర్చి పంటకు డిమాండ్ పెరిగి ప్రపంచవ్యాప్తంగా విశేష ఖ్యాతి లభించనుందని  రాజిరెడ్డి తెలిపారు.  జిల్లాలో 20 వేల మందికి పైగా రైతులు ఏటా దాదాపు 7 వేల ఎకరాల్లో 10 వేల టన్నులకు పైగా చపాటా మిర్చి ని ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. మరిన్ని వివరాలను అందిస్తున్న మా వరంగల్ ప్రతినిది....

**వాయిస్ కాస్ట్**

**(PTC)**

------------------------

**కరీంనగర్  వక్ఫ్ బోర్డు**

దేశంలో కొంత మంది చేతుల్లో ఉన్న వక్ఫ్ బోర్డు భూములు ఇతర ఆస్తుల విషయం లో సవరణ బిల్లు అవసరం అని కరీంనగర్ జిల్లాకు చెందిన ముస్లీమ్ యువకులు అభిప్రాయపడ్డారు. కరీంనగర్ జిల్లాకు చెందిన మహమ్మద్ పర్వీజ్, భషీర్ తమ అభిప్రాయంను ఆకాశవాణి ప్రతినిధి సంపత్ కుమార్ కు తెలియజేశారు.

------ **బైట్** -----------

**పీటీసీ**

----------------------

**RAINS**

ద్రోణి ప్రభావంతో  రాష్ట్రంలో  మూడు రోజులు వర్షాలు కురుస్తాయని  హైదరాబాద్ వాతావరణ కేంద్రం  తెలిపింది. పలు చోట్ల  ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్లు కురుస్తాయని  పేర్కొంది. ఇవాళ కామారెడ్డి,  నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్టు, ఉమ్మడి  కరీంనగర్,  హైదరాబాద్, మహబూబ్  నగర్ , మెదక్ జిల్లాలకు ఎల్లో అలర్డు జారీ చేసింది. రేపు కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో  వర్షాలు కురుస్తాయని  అంచనా వేసింది.

(PN)

-----------------------

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

-----------------------